క్లుప్తంగా

ప్రజలకు పీవీఎల్ పండుగ శుభాకాంక్షలు


మాట్లాడుతున్న పీవీఎల్

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆనందంగా ఉన్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ పెదఅమిరం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో తులతుగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు మహిళలు పండుగ రోజున సంతోషంగా గడపాలని సూచించారు.

బీపీ మెషీన్ బహూకరణ


బీపీ మెషీన్ బహూకరిస్తున్న దాతలు

కాళ్ల: కలవపూడి వెల్నెట్ సెంటర్‌కు దాతలు సహకారంతో బీపీ మెషీన్ ఏర్పాటు చేసినట్లు పీహెచ్సీ వైద్యులు గులాబీ రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలవపూడి పెద్దలు వైఎస్సార్‌సీపీ నేత, సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స ప్రసాద్ రాజు, సొసైటీ సీఈఓ కనుమూరు మణి చేతుల మీదుగా బీపీ మెషీన్ అందజేశారు.

కందిపప్పు నాణ్యతలో లోపం లేదు


పెనుగొండ అంగన్‌వాడీ కేంద్రంలో కందిపప్పు నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కందిపప్పు అందిస్తున్నామని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివప్రసాద్ చెప్పారు. జిల్లాలోని వివిధ మండలాల్లోని వినియోగదారులు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కందిపప్పు నాణ్యతను సివిల్‌సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు పరిశీలించినట్టు చెప్పారు. పేదలకు, పిల్లలకు ప్రభుత్వం సరఫరా చేస్తోన్న కందిపప్పు నాణ్యతపై కొందరు అసత్యప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.100 పైబడి ఉంటే ప్రభుత్వం రూ.67కే పంపిణీ చేస్తున్నట్లు శివప్రసాద్ తెలిపారు. కందిపప్పు నాణ్యతపై అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు, లబ్ధిదారుల గృహాల వద్ద కూడా పరిశీలించగా కేవలం ఎనిమిది నిమిషాల్లో పప్పు ఉడుకుతున్నట్టు వినియోగదారుల తెలిపారని చెప్పారు. కందిపప్పు నాణ్యతపై జరిగే అసత్యప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని కోరారు.

కోలమూరులో క్షత్రియ సమ్మేళనం


మాట్లాడుతున్న క్షత్రియ ప్రముఖులు

ఉండి: మండలంలోని కోలమూరులో క్షత్రియ సమ్మేళనం క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి పలువురు దాతలు ముందుకొచ్చారు. గ్రామ సచివాలయ భవన నిర్మానానికి 10 సెట్లు భూమి ఇచ్చి భవన నిర్మాణంలో తోడ్పడినందుకు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు, నడింపల్లి సత్యవతిలను సత్కరించారు. గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధికి కూనపరాజు సీతారామ రాజు రూ.10 లక్షలు, పేరిచెర్ల సుభాష్‌రాజు అతని సోదరులు రూ.5 లక్షలు, గండ్రాజు రాజేష్‌వర్మ రూ.5 లక్షలు, ముదునూరి సుబ్బరాజు రూ.5 లక్షలు, సామంతపూడి బాలకృష్ణంరాజు రూ.లక్ష, కూనపరాజు విజయరామ రాజు అతని సోదరులు రూ.18 లక్షల విలువైన భూమి గ్రామంలో ఆసుపత్రి నిర్మాణానికి, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.8 లక్షల విలువైన రెండు సెంట్ల భూమిని అందించారు. దాతలను, టీటీడీ రిటైర్డ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ అధికారి కలిదిండి సత్యనారాయణరాజును సేవాసమితి ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పేరిచెర్ల బాలరాజు, పేరిచెర్ల పద్మనాభరాజు, గండ్రాజు రాజేష్‌వర్మ, రుద్రరాజు నరసరాజు, జగపతి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల మేలుకు కృషి

పాలకొల్లు అర్బన్: క్రైస్తవులకు మేలు చేయడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ముఖ్య సలహాదారుడు వైఎస్ థామస్‌రెడ్డి అన్నారు. పాలకొల్లు వడ్లవానిపేట త్రియేకదేవుని సంఘం గొల్ల రాజబాబు చర్చిలో శుక్రవారం నిర్వహించిన పాస్టర్ల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.

రూ.8 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు

ఎమ్మెల్యే శ్రీనివాస్


భీమవరంలో మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నామని, వీటికితోడు రూ.8 కోట్లు వ్యయంతో చేపట్టే 34 అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులపై శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. వివిధ వార్డుల్లో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని, విస్సాకోడేరు జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల ఖర్చవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. భీమవరం జిల్లా కేంద్రంగా అవతరించడంతో పట్టణంలో సమస్యలు తలెత్తకుండా సుందరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగానే వివిధ ప్రాంతాల్లో విద్యుత్ ఎల్ఈడీ స్ట్రిప్ రోప్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించాలని, అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని శ్రీనివాస్ కోరారు. శివారు ప్రాంతాల్లో ఎక్కడైనా డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు పారదర్శకతతో పనులు పూర్తి చేయించి ప్రజాభిమానాన్ని పొందాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, ఎంఈ త్రినాథరావు, డీఈటీ నారాయణరావు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో అత్యాధునిక పద్ధతిలో డంపింగ్ యార్డ్


విస్సాకోడేరు డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శిరీష

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరులో డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ శిరీష శుక్రవారం పర్యటించారు. జిల్లాలో ఎక్కడ లేనటువంటి విధంగా విస్సాకోడేరులో సర్పంచ్ బోళ్ల శ్రీనివాస్ చొరవతో డంపింగ్ యార్డ్ షెడ్‌ను అత్యాధునిక పద్ధతిలో తీర్చిదిద్దారు. ఈ యార్డ్‌ను పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కోఆర్డినేటర్ శిరీష డంపింగ్ యార్డ్‌తో పాటు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. షెడ్‌తో పాటు తడి పొడి చెత్త వేరు చేసే విధానం, వర్మి కంపోస్టు తయారీ, ఆకు, కాయగూరల పెంపకం, వాటి ద్వారా వచ్చే ఆదాయ వనరులపై సర్పంచ్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డ్ ప్రాంతంలో నాటిన పండ్లు, పూవ్వుల మొక్కల పెంపకాన్ని చూసి సర్పంచ్ శ్రీనివాస్‌ను ఆమె అభినందించారు. డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన శిరీష, ఆమె బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్మాణం, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ నిర్మాణంతో గ్రామంలో దీర్ఘకాలం నుంచి వేధిస్తున్న పారిశుధ్య సమస్యను పరిష్కరించామని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తులు, పాలకవర్గం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అధికారుల సహకారంతో ఈ షెడ్‌ను నిర్మించి, నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆనందోత్సాహాలతో అపూర్వ కలయిక


భీమవరంలో కలిసిన పూర్వ విద్యార్థులు


రాయకుదురులో కలిసిన పూర్వ విద్యార్థులు

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్లో శుక్రవారం పూర్వవిద్యార్థుల అపూర్వకలయిక ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పదో తరగతి 1998 బ్యాచ్ విద్యార్థులు 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కలిశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనందంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

అపూర్వ సమ్మేళనం

వీరవాసరం: ఆత్మీయ ఆలింగనాలతో ఆ పాఠశాల ప్రాంగణమంతా హోరెత్తింది. రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ శుక్రవారం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు.

క్రికెట్ విజేత భీమవరం గ్రీన్స్ జట్టు


ట్రోఫి అందుకుంటున్న గ్రీన్స్ జట్టు కెప్టెన్ చల్లారావు

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో పూర్వవిద్యార్థులు మూడు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో భీమవరం గ్రీన్స్ జట్టు విజయం సాధించింది. శుక్రవారం ఫైనల్స్ పోటీలు ప్రారంభంలో ముందుగా భీమవరం గ్రీన్స్‌జట్టు బ్యాటింగ్ చేసి నిర్ణీత 25 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన భీమవరం బ్లూస్ జట్టు 170 పరుగులకే ఆలౌట్ అయ్యింది. విజేత గ్రీన్స్ జట్టు కెప్టెన్ గ్రంధి చల్లారావుకు డీఎన్నార్ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) ట్రోఫీని అందజేశారు. మ్యాన్‌ఆఫ్ ది సిరీస్‌గా కోకా సతీష్, మ్యాన్ ఆఫ్ ది బ్యాట్స్‌మెన్‌గా ఫణిశర్మ, ఉత్తమ బౌలర్‌గా సీహెచ్ రాధాకృష్ణ, బెస్ట్ ఫీల్డర్‌గా పులగం శేషారావు, ఉత్తమ కీపర్‌గా వై.రామకృష్ణ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సహాయ కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, బీజేపీ నాయకుడు పాకా వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భోగి

కాళ్ల: సంక్రాంతి ముందు రోజు భోగి పండుగను ప్రజలు వైభవంగా నిర్వహిస్తారు. చిన్నారులు చేసిన పిడకలు, పాత సామాన్లను భోగి మంటల్లో వెయ్యడం సంప్రదాయం. రాష్ట్రీయ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు స్వగ్రామమైన జక్కరం గ్రామంలో వినాయకుని ఆలయం వద్ద ప్రతి ఏడాదీ ఎంతో వైభవంగా భోగి పండుగ నిర్వహిస్తారు. ఈ ఏడాదీ భోగి మంట వేసేందుకు పాత సామానం, కట్టెలు ఏర్పాటు చేసి రంగవల్లులు వేసి అందంగా ముస్తాబు చేశారు. పాతపాటి సర్రాజు కుటుంబ సభ్యులచే భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలకు అవార్డులు


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో గోపాలకృష్ణమూర్తిని అభినందిస్తున్న జగపతిరాజు

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలోని కేంద్ర ప్రభుత్వ అతుల్ ఇంక్యుబేషన్ సెంటర్ రెండు అవార్డులు ప్రకటించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. అవార్డులకు కృషి చేసిన కళాశాల టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ నూకల గోపాలకృష్ణమూర్తిని యాజమాన్యం తరపున శుక్రవారం ప్రిన్సిపాల్ అభినందించారు. కళాశాలలో స్టార్టప్‌లను ప్రోత్సహించి ఎక్కువ స్టార్టప్‌లు తమ కళాశాలలో ఏర్పడేందుకు చేసిన కృషికి అవార్డులు దక్కాయని గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 21న అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అతుల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులు తమ కళాశాలకు ప్రదానం చేయనున్నారని వివరించారు.

తాటాకిల్లు దగ్ధం


ఉప్పలూరులో దగ్ధమవుతున్న తాటాకిల్లు

ఉండి: ఉండి మండలం ఉప్పులూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. ఆర్ఐ వి.ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 11:50 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్రామంలోని గంధం సాయిబాబుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే తాటాకిల్లు పూర్తిగా కాలిపోయింది.

సంక్రాంతికి గ్రామాల ముస్తాబు


చిలుకూరులో పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ వెంకట సోమరాజు, సిబ్బంది

ఉండి: సంక్రాంతికి గ్రామాలు ముస్తాబయ్యాయి. చిలుకూరు, ఎన్నార్పీ అగ్రహారం, చెరుకువాడ, మహదేవపట్నం, ఉండి, వాండ్రం, యండగండి, కోలమూరు తదితర గ్రామాలను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. ముగ్గు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. చిలుకూరులో ప్రసిద్ధిగాంచిన పైళ్లమ్మవారి జాతర మహోత్సవ ఏర్పాట్లు వేగంగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి అనంతరం 17వ తేదీ నుంచి ప్రారంభించే జాతర మహోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి అతిథులు, సమీప గ్రామ ప్రజలు విచ్చేస్తుండడంతో గ్రామంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతికి గ్రామంలో సంప్రదాయ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వెంకట సోమరాజు తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల జాతర


సర్రాజు దంపతులను సత్కరిస్తున్న సూర్యనారాయణరాజు

కాళ్ల: జక్కరం మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. సర్రాజు దంపతులను ఆలయ నిర్మాణ కర్త పాతపాటి సూర్యనారాయణరాజు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్రాజు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. రైతులు, ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాతపాటి వర్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం


అల్లూరి వేషధారిణిని సత్కరిస్తున్న సర్రాజు

ఆకివీడు: మానవ మేథస్సు వృద్ధికి విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు అన్నారు. ఆకివీడు మండలం దుంపగడప ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు శుక్రవారం కళాశాల ఆవరణలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్రాజు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితమే పల్లెటూళ్లలో విద్యావ్యాప్తికి స్వతంత్ర్య సమరయోధుడు దివంగత చింతలపాటి వర ప్రసాద మూర్తిరాజు పునాదులు వేశారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మూడేళ్లలో విద్యకు అధిక నిధులు కేటాయించిందని, ఆంగ్లవిద్యా బోధనతో పాటు పలు సంస్కరణలు తీసుకొచ్చిందని చెప్పారు. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిన కళాశాల అభివృద్ధి కమిటీ, పూర్వపు విద్యార్థి కమిటీ ప్రతినిధులకు సర్రాజు ధన్యవాదాలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి, మూర్తిరాజు శత జయంతి, 75వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఒకే వేదికపై నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. మరో ముఖ్యఅతిథి వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు మాట్లాడుతూ మూర్తి రాజు ఆశయాలకు అనుగుణంగా కళాశాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అభివృద్ధి కమిటీ కార్యదర్శి నంబూరి వెంకట్రామరాజు మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలతో, దాతల సహకారంతో కళాశాలను అభివృద్ధి చేశామని చెప్పారు. 125వ జయంతి సందర్భంగా అల్లూరి వేషధారణ వేసిన ఉపాధ్యాయుడు పెంకి విజయ్‌కుమార్‌ను సర్రాజు, వెంకట్రామరాజు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మం, ఆయా కమిటీల ప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

'అగ్ని ప్రమాద బాధితులకు పక్కా ఇల్లు నిర్మిస్తాం'


చెరుకుమిల్లిలో బాధితులకు సాయం అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, జెడ్పీటీసీ శ్రీను

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి రెండు తాటాకిళ్ల దగ్ధమై బొర్రా కృష్ణామూర్తి, తిరిబొమ్మ మారియ్యలు కట్టు బట్టతో బయటపడ్డాయి. బాధితుల్ని శుక్రవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించారు. పక్కా భవనం నిర్మించేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడినట్లు పీవీఎల్ చెప్పారు. ఇల్లు నిర్మించుకుందామని దాసుకున్న రూ.2లక్షలు కాలిపోవడంతో కృష్ణమూర్తి ఆశ నీరుగారిందన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున రూ.10 వేలు, పీవీఎల్, యండగండి శ్రీను రూ. 5 వేలు చొప్పున సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు మంతెన సీతారామరాజు (సుభీ) ఆర్థిక సహాయంతో 25 కేజీల బియ్యం బస్తాలు రెండు, వంట సామగ్రి, కిరాణా సరుకులు, దుప్పట్లు, దుస్తులు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మంతెన సునిల్ వర్మ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, సర్పంచ్ నందమూరి ప్రకాశం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ, ఎరిచర్ల సాంబర్లిన్, కుంచంపూడి లక్ష్మీ నర్సింహవర్మ, దాట్ల బోసురాజు, కురెళ్ల మాణిక్యాలరావు, అద్దంకి ప్రసాద్, చిల్లిముంత భోగన్న, వీఆర్వో ద్వారకా తదితరులు పాల్గొన్నారు.

వేంపాడులో ప్రభుత్వ భూమిని కాపాడండి


ఫిర్యాదు ప్రతులను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాళ్ల: వేంపాడు గ్రామంలో అన్యాక్రాంతమవుతోన్న ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ వీరమల్లు మోహనరావు (బోసు) కోరారు. వేంపాడు గ్రామంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారుని ఆనుకుని ఉన్న సుమారు 500 మీటర్ల మేర ప్రభుత్వ భూమిని రైతులు వ్యవసాయ అవసరాలకు, ప్రజలు కాలిబాట మార్గంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా 2020 సంవత్సరంలో ఎకరం భూమి జగనన్న ఇళ్ల స్థలాలకు కోర్టు ఆదేశాల అనంతరం కేటాయించనున్నట్టు చెప్పారు. ఈలోపు కొందరు భూస్వాములు సదరు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఆర్అండ్‌బీ రహదారి ప్రారంభంలో గేటు నిర్మించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గేటు నిర్మాణం వల్ల ప్రజలు, రైతులు వెళ్లడానికి లేకుండాపోయిందని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, వీఆర్వోలకు ఫిర్యాదు చేశామన్నారు. రైతులకు ఇబ్బంది కలిగేలా గేటు ఏర్పాటు చేసిన భూస్వాములను కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో దాసరి సత్యనారాయణ, వీరమల్లు చిన్నగంగయ్య, సిద్ధాని సాంబశివ పాల్గొన్నారు.

శృంగవృక్షంలో ఆటల పోటీలు


శృంగవృక్షంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కృష్ణంరాజు

పాలకోడేరు: శృంగవృక్షంలో కలిదిండి మురళీ కృష్ణంరాజు సేవాసమితి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా యువత చెడు వ్యసనాల వైపు మళ్లకుండా, సంప్రదాయ క్రీడలు నిర్వహిస్తున్నామని కలిదిండి మురళీ కృష్ణంరాజు సేవా సమితి వ్యవస్థాపకుడు కలిదిండి కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం శృంగవృక్షంలోని సేవాసమితి ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. తన సోదరుడు మురళి పేరిట సేవాసమితి ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కృష్ణంరాజు తెలిపారు. పేకాట, గుండాట, కోడిపందాలు వంటి జూద క్రీడల జోలికి వెళ్లవద్దని యువతకు సూచించారు. కార్యక్రమంలో రవికుమార్ రాజు, రామకృష్ణంరాజు, సునీల్, కలిదిండి కృష్ణంరాజు, వైస్ ఎంపీపీలు సోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీ తులసి, గునుపూడి బాలాజీ, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ మహాసభలను విజయవంతం చేయండి

సాక్షి, భీమవరం: అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభలు ఫిబ్రవరి 23 నుంచి నాలుగు రోజులపాటు హైదరాబాదులో నిర్వహించనున్నట్టు ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు తెలిపారు. ఈ సభలకు 29 రాష్ట్రాల నుంచి 580 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. నేతాజీ ఆలోచన విధానంలో దేశానికి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రూపొందిస్తుందని తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈనెల 25, 26 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆత్మీయ సమ్మేళనం

ఉండి: ఉండి జెడ్పీ హైస్కూల్ 1974 – 75 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ బ్యాచ్ తరపున పాఠశాలలో రూ.4.5 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మించినట్టు తెలిపారు. పూర్వ విద్యార్థులు గొట్టుముక్కల సీతారామరాజు, ఆళ్లగిరి సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.